క్లుప్తంగా

తాగునీటి కోసం నిరసన


బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మునిపల్లి(అందోల్): తాగునీటి సౌకర్యం కల్పించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. మంగళవారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


సదస్సులో పాల్గొన్న సంఘం సభ్యులు

జహీరాబాద్ టౌన్: పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఐకేపీ డీపీఎం మల్లేశం అన్నారు. ఐకేపీ మండల సమైఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు పౌష్టకాహారం తీసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, రక్తహీనతపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శివకుమార్, సీసీలు, వీఓఏలు, వీఓ లీడర్లు, ఎంఎస్ ఓబీ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంక్షేమానికి కృషి

ఆ సంఘం అధ్యక్షుడు మాణిక్ ప్రభు

సంగారెడ్డి రూరల్: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సంగారెడ్డి పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మాణిక్ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్ రోడ్డులోని శ్రీ గణేష్ హెయిర్ స్టైల్ షాపులో సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ ప్రభు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి, పేద నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు సేవ చేసే విషయంలో కలిసొచ్చే ప్రతి ఒక్కరితో ముందుకు పోతామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, శ్రీశైలం, ప్రభు, మురారి, శేఖర్, స్వాగత్ ప్రభు, పెంటయ్య, చరణ్, రాము, దుర్గేష్, అశోక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీపోటీలు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని డప్పూర్ గ్రామ శివారులోని హజ్రత్ పీర్ గైబ్ అలై ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. కుస్తీపోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. పహిల్వాన్‌లు కుస్తీలు పడుతుండగా ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, ఈలాల మధ్య పోటీలు రసవత్తరంగా సాగాయి. చివరకు కర్నాటక ప్రాంతానికి చెందిన సిద్దు బిల్కెడికి మొదటి బహుమతి వరించింది. సిద్దు బిల్కెడికి 11 తులాల వెండి కడియంతో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవికుమార్, జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జమిరోద్దీన్ పాల్గొన్నారు.

క్రికెట్‌టోర్నీ విజేత షాపూర్ జట్టు



జహీరాబాద్: సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో షాపూర్‌జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం మండలంలోని నిర్వహించిన ఫైనల్ పోటీల్లో శేకాపూర్‌తండా జట్టుపై వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని షాపూర్‌తండా జట్టు విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకుంది. ఈ సందర్భంగా మల్‌చల్మ మాజీ సర్పంచ్ ఎం.పాండురంగారెడ్డి, ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ పవార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసునాయక్, యూత్‌కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌సింగ్ రాథోడ్‌లు విన్నర్, రన్నర్ జట్లకు నగదు పారితోషికం, కపలను అందజేశారు. కార్యక్రమంలో బంజారా సంఘాల నాయకులు కిషన్ చౌహాన్, రఘు నాథ్ రాథోడ్, శీను బానోతు, రామ్‌సింగ్, జైపాల్, శంకర్‌నాయక్, సునీల్, శ్రీకాంత్ రాథోడ్, ధన్‌రాజ్, విజయ్, సంజు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. విజేత జట్టుకు రూ.71వేలు, రన్నర్ జట్టుకు రూ.41వేలు నగదు అందజేశారు.

స్కాన్ చేయండి .. అభిప్రాయం చెప్పండి

పోలీసుల పనితీరుపై క్యూఆర్ కోడ్
- నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చిన పోలీస్‌శాఖ
- ప్రజాభిప్రాయాన్ని ధైర్యంగా తెలియజేయండి
- పట్టణ సీఐ రమేష్

సంగారెడ్డి క్రైమ్: మీరు ఏదైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ మీ సమస్యను తెలియజేసి, పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారా? మీకు పోలీసుల పనితీరు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయా? పోలీసుల పనితీరు నచ్చక ఎవరికి ఫిర్యాదు చేయాలని తెలియక సంకోచిస్తున్నారా? ఇప్పుడు ఇలాంటి సందేహాలకు జిల్లా పోలీస్‌శాఖ చెక్ పెట్టనుంది. సంగారెడ్డి జిల్లాలో పోలీసుల పనితీరును నేరుగా తెలుసుకోవడానికి, డిజిటల్ రూపంలో తమ అభిప్రాయం చెప్పేందుకు పోలీస్ ఉన్నతాధికారులు క్యూఆర్ కోడ్ స్కాన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఫోన్‌తో పోలీస్‌స్టేషన్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. నేరుగా రాష్ట్ర పోలీస్‌శాఖ కార్యాలయానికి చేరుతుంది. పోలీసుల సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

స్కాన్ చేయండి.. అభిప్రాయం చెప్పండి

రాష్ట్ర డీజీపీ డిసెంబర్ 9న తన కార్యాలయంలో రాష్ట్ర పోలీస్‌శాఖ పనితీరు, అలంబిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలపై ప్రజాభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్ సేవలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 32 పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులోకి రానున్నట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. గతంలో పోలీస్‌శాఖ పనితీరు ఔట్‌సోర్సింగ్, ఎంప్లాయిస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయం సేకరించేవారు.



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్

ఇలా అభిప్రాయం..

పోలీస్‌స్టేషన్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే గూగుల్‌లో అప్లికేషన్ ఫారమ్ తెరచుకుంటుంది. అందులో తెలుగు, ఇంగ్లీష్ భాషలో నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. ఫారమ్‌లో ముందుగా భాషను ఎంపిక చేసుకోవాలి. తర్వాత మీ పేరు, జెండరు ఎంచుకోవాల్సి ఉంటుంది. మీ వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను నమోదు చేయాలి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా ఎఫ్‌ఐఆర్ నమోదు, ఈ -చాలన్, మీసేవ అప్లికేషన్, పాస్‌పోర్ట్ వంటి తదితర అంశాలపై ప్రజల తమ అభిప్రాయాన్ని ధైర్యంగా ఆన్‌లైన్‌లో తెలియజేయవచ్చు. పట్టణ ప్రజలు స్వేచ్ఛగా స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని చెప్పొచ్చని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు

డీఎస్పీ సత్తయ్యగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

మునిపల్లి(అందోల్): విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ హెచ్చరించారు. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన మోహమ్మద్ ఇస్మాయిల్ అలియాబేగం (15) 16న చికిత్స పొందుతూ మృతి చెందింది. మంగళవారం కొండాపూర్ సీఐ వెంకటేశం, బుదేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 11న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో వీరారెడ్డి, విజయారెడ్డి ఇంటి ఖాళీ స్థలంలో మోహమ్మద్ ఇస్మాయిల్ మూత్రం పోశాడు. ఇక్కడ ముత్రం పోయొద్దని ఎన్నిసార్లు చెప్పిన తిరిగి ఇక్కడే ఎందుకు పోస్తున్నావని ఇరువురు గొడవ పడ్డారు. గొడవ చప్పుడు విని ఇస్మాయిల్ కూతురు అలియాబేగం గొడవ పడవద్దని వీరారెడ్డి, విజయరెడ్డిల నుంచి తన తండ్రి ఇస్మాయిల్‌ను విడిపించేందుకు ప్రయత్నించింది. దీంతో వీరారెడ్డి, విజయారెడ్డి అలియాబేగంపై రాయితో దాడి చేశారు. చిన్నచల్మెడలో అలియాబేగంకు చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. మరుసటి రోజు నొప్పి ఎక్కువగా ఉండడంతో సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మృతి చెందింది. దీంతో బుదేరా పోలీస్‌లు వీరారెడ్డి, విజయారెడ్డిలను అరెస్టు చేశారు. కొందరు సోషల్ మీడియాలో ఇరువురి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడంపై డీఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన పరిహారం అందిస్తాం

నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రాజు

న్యాల్‌కల్(జహీరాబాద్): నిమ్జ్‌కు భూములు ఇచ్చే రైతులకు మెరుగైన పరిహారం అందిస్తామని నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు అన్నారు. మంగళవారం హద్నూర్‌లో నిమ్జ్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల రిజిస్ట్రేషన్ల ఆధారంగా ప్రభుత్వం జనరల్ అవార్డు కింద భూములు కోల్పోయిన రైతులకు మంచి పరిహారం ఇవ్వనున్నట్లు చెప్పారు. మూడు పంటలు పండే మాజీవనాధారమైన భూములకు మంచి పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అన్ని ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి పరిహారం ఇస్తుందని డిప్యూటీ కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, నిమ్జ్ ఆర్ఐ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక కాంగ్రెస్‌పార్టీకి ప్రతిష్టాత్మకమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బసవ సేవాసదన్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి వ్యూహాత్మకంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఓటు కీలకమైందని పార్టీ యంత్రాంగాన్ని సమర్థంగా వినియోగించుకుంటే గెలుపు సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధన్న, మాజీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్(అందోల్): మంత్రి దామోదర రాజనర్సింహ్మ రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నాపూర్‌లో 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ సర్వే పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుందన్నారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం పనులు గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రాధాన్యత క్రమంగా అభివృద్ధి పనులు మంజూరు అవుతున్నాయని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.7 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నారాయణఖేడ్‌కు రూ. 60 కోట్లు, రాయికోడ్‌కు రూ. 50 కోట్ల నిధులతో నూతన గ్రంథాలయాల భవనాల నిర్మాణానికి మంజూరు అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ సర్పంచ్ సతీష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివాలయ ప్రాణప్రతిష్ఠ

నారాయణఖేడ్: మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్‌లో మంగళవారం నిర్వహించిన శివాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. ఆయనకు పురోహితులు మంత్రోచ్ఛరణలతో స్వాగతం పలికారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, పెద్దశంకరంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయినిమధుప టేల్ పాల్గొని పూజలు నిర్వహించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామ పంచాయతీకి నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా గ్రామ పంచాయతీతో చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వల్ల పంచాయతీల నిర్వహణ భారంగా మారిందన్నారు. పారిశుద్ధ్యం పనులు, బ్లీచింగ్ ఫౌడర్, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, ట్రాక్టర్లకు డీజిల్ తదితర అవసరాల కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నిధులు, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవి, జయ్‌సింగ్, కిషన్‌రెడ్డి, నందీశ్వర్ పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

ఆర్డీఓ రాంరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఝరాసంగం(జహీరాబాద్): మహాశివరాత్రి జాతరను పురస్కరించుకొని కేతకీ సంగమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆర్డీఓ రాంరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఝరాసంగంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి మహాశివరాత్రి నవనిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు రానున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఇలా అయితే ఏర్పా ట్లు ఎలా చేస్తారని పలువురు చర్చించుకున్నారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శివరాజ్, జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ సుధాకర్, ఎస్ఐ నరేష్, ఆలయ ఈఓ శివరుద్రప్ప పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం


మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

జహీరాబాద్: పట్టణ పరిధి మహీంద్రకాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా సాగింది. వందలాది మంది దంపతులు స్వామివారికి, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేదబ్రాహ్మణులు మంత్రోచ్ఛారణల మధ్య ఎంతో వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై పట్టణంలోని పలు కాలనీల గుండా ఊరేగింపు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణంతో కాలనీలు మార్మోగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి ఎస్.రాజేష్, ఉపాధ్యక్షుడు కె.సంగారెడ్డి, వీరస్వామి, జానారెడ్డి, చంద్రకాంత్ రెడ్డిలు భక్తులకు పాల్గొన్నారు.

జాతరలతో ఆధ్యాత్మిక వాతావరణం

పటాన్‌చెరు టౌన్: జాతరలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో రెండవ పెద్ద జాతర గొల్లగట్టు లింగమంతుల స్వామి అని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం.. దురాజ్‌పల్లిలో జరిగే తెలంగాణ రెండవ పెద్ద జాతర పెద్దగట్టు (గొల్లగట్టు)లో మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్మూర్తి యాదవ్, తుంగతుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, అశోక్, లింగన్న నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పాత బస్టాండ్, పోతిరెడ్డి పల్లి చౌరస్తా ,బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ముగ్గురికి రెండురోజులు జైలుశిక్ష, ఇద్దరికి రూ. 2000, మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్:డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందికి జరిమానా విధించారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న నిరసనలు

జిన్నారం(పటాన్‌చెరు): 14 రోజులుగా గుమ్మడిదలలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రైతు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే, గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.. కుల సంఘాలు, యువజన సంఘాలు మద్దతు తెలుపుతున్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సదాశివపేట(సంగారెడ్డి): 33బై11కేవీ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ వాటర్ సప్లై ఫిడర్ పరిధిలోని గాంధీచౌక్, శాస్త్రిరోడ్, వ్యవసాయ మార్కెట్ పరిధిలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉ.10 గంటల నుంచి మ. 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని చెప్పారు.

◆ అధిక మార్కులు సాధించాలి

మునిపల్లి(అందోల్): పదవ తరగతిలో అధిక మార్కులు సాధించాలని మండల ప్రత్యేకాధికారి రామాచారి విద్యార్థులను కోరారు. మంగళవారం మండలంలోని అంతారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్పెషల్ క్లాసులను తనిఖీ చేశారు. అంకితభావంతో చదివి అధిక మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు సాబేర్ హూసేన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

◆ తాగి వాహనం నడిపితే చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో శివాజీచౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సరియైన డాక్యుమెంట్స్ లేకపోవడంతో పలు వాహనాలు సీజ్ చేశారు. తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో హట్కర్‌పేట బంగారు మైసమ్మ 11వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కలశాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన హోమాలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చింతా సాయినాథ్, మందిరం అధ్యక్షుడు మనోహర్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, ఆల్ ఇండియా డాక్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సోమ చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు హరిహరకిషన్ పాల్గొన్నారు.

◆ ఎంఐఎంలో పలువురి చేరిక

జహీరాబాద్ టౌన్: ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సమక్షంలో మండలంలోని శేఖాపూర్‌కు చెందిన పలువురు యువకులు మంగళవారం ఎంఐఎం పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జహీరాబాద్ ప్రాంతంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ అధ్యక్షుడు అక్తర్ అహ్మద్, నాయకులు మోహియోద్దీన్ ఘోరీ, అక్బర్, మాజీద్, ఎండీ హేసేన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ముబారక్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా భరత్‌కుమార్, ఉపాధ్యాయులుగా భూమిక, అజయ్, అఖిలాష్, శ్రీనుత, అమూల్య, నాగరాజ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిష్టయ్య, ఉపాధ్యాయులు దయానంద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ వ్యర్థ జలాల నుంచి శాంపిళ్ల సేకరణ

పటాన్‌చెరు: నక్కవాగులోకి నేరుగా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థ జలాలను వదులుతున్న ట్యాంకర్‌ను పీసీబీ శాఖ సిబ్బంది పట్టుకుని శాంపిల్స్ సేకరించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై నక్కవాగు బ్రిడ్జి పై నుంచి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థ జలాలను పైపు ద్వారా వదులుతున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పీసీబీ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ ట్యాంకర్ నుంచి నీటిని వదలకుండా అడ్డుకున్నారు. ఈ వ్యర్థాలు ఎక్కడి నుంచి తెచ్చారని డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించారు. ముత్తంగిలోని ఉడిపి హోటల్ వ్యర్థాలు అని వారు తెలిపారు. వాహనం నుంచి శాంపిల్స్ సేకరించారు. పీసీబీ ఈఈ గీతా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉడిపి హోటల్ నిర్వాహకులను జలవనరుల్లో వ్యర్థాలు పారవేయరాదని హెచ్చరించారు. శాంపిల్స్ ఫలితాలు వచ్చాక హానికర అవశేషాలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.